ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 26.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 16 జూన్ 2025



ఇది యాడికి మండలం కొట్టాలపల్లిలోని ప్రాథమిక పాఠశాల. ఈ స్కూల్‌లో ఒకే విద్యార్థి ఉన్నాడు. ఒక టీచర్ పనిచేస్తున్నారు. ఏదైనా కారణంతో విద్యార్థి రాకపోతే.. ఆ రోజు టీచర్ ఖాళీగా కూర్చోవాల్సిందే. టీచర్ సెలవు పెట్టినా.. బడి ఉండదు.



ఇది యాడికి మండలం తిప్పారెడ్డిపల్లిలోని ప్రాథమిక పాఠశాల. ఇందులో ముగ్గురు విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారు. వారిలో ఒకరు రాకపోవడంతో ఇద్దరే మిగిలారు. వారికి ఒక టీచర్ ఉన్నారు.

మూత బడులు..!

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల సంఖ్య

- ఇప్పటికే పలు బడుల మూత
- అదే బాటలో మరికొన్ని..
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు

యాడికి, జూన్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య దారుణంగా తగ్గిపోయింది. దీంతో పాఠశాలలు మూతపడే ప్రమాదం పొంచి ఉంది. ఒకరు... ముగ్గురు విద్యార్థులు ఉన్న పాఠశాలల నిర్వహణ సాధ్యమయ్యే పనేనా అని ఉపాధ్యాయులు, ఆయాగ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఒక విద్యార్థి ఉన్న పాఠశాల కూడా ఉంది. ఏదైనా కారణంతో విద్యార్థి పాఠశాలకు రాకపోతే టీచర్ ఖాళీగా కూర్చోవాల్సిందే. పదిమందిలోపు విద్యార్థులున్న పాఠశాలలు మండలంలో నాలుగు ఉన్నాయి.

యాడికి మండలంలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలు
వి. కొట్టాలపల్లి - ఒకరు
తిప్పారెడ్డిపల్లి - ముగ్గురు
కూర్మాజీపేట - నలుగురు
నిట్టూరు (రోడ్) - ఆరుగురు
రామరాజుపల్లి - 11 మంది

ఆయా గ్రామాల్లో విద్యార్థులు చాలామందే ఉన్నారు. వారంతా ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఆయా గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. తద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి. విద్యార్థుల సంఖ్య పడిపోవడంతో ఇప్పటికే మండలంలోని తిరుణాంపల్లి, కుందనకోట, పుప్పాల తండా గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. ఇప్పుడు ఆయా గ్రామాల్లోని ప్రజలు తమ ఊరిలో బడి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొట్టాలపల్లి, తిప్పారెడ్డిపల్లి, కూర్మాజీపేట, నిట్టూరు (రోడ్), రామరాజుపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా విద్యార్థులు సంఖ్యను పెంచేవిధంగా చర్యలు తీసుకోకపోతే ఆయా గ్రామాల్లోని పాఠశాలలు మూతపడడం ఖాయం.



కొట్టాలపల్లిలోని ప్రాథమిక పాఠశాల

గతంలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడిన గ్రామాలు
కుందనకోట, తిరుణాంపల్లి, వీరారెడ్డిపల్లి, ఎన్. కొత్తపల్లి, టి. కొత్తపల్లి, పుప్పాల తండా

ఆ గ్రామాల్లో నేడు అవస్థలు

విద్యార్థుల సంఖ్య లేక నాడు పాఠశాలలు మూతపడడంతో నేడు ఆయా గ్రామాల్లోని ప్రస్తుతం ఉన్న విద్యార్థులు చదువుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఇబ్బందులు పడుతూ వేలకు వేలు బడులు, వాహనాల ఫీజులు చెల్లిస్తూ సమీప పట్టణాల్లోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లవలసి వస్తోంది. ఆర్థిక సమస్యలతో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను బడులు మాన్పించి పనులకు పంపిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల గ్రామాల ప్రజలు, విద్యావంతులు, విద్యాశాఖ అధికారులు అవగాహన చర్యలు చేపటాలి. తద్వారా విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అవగాహన కల్పిస్తాం

విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు ఉన్న గ్రామాల ప్రజలకు అవగాహన చర్యలు చేపడతాం. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్థుల సహకారం ఎంతో అవసరం.

\- కాశప్ప, ఎంఈఓ, యాడికి

నేడు యాడికిలో
ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

యాడికి, జూన్15(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. స్థానిక బుగ్గ రోడ్డులోని టీటీడీ కల్యాణమండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

బెళుగుప్ప, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అవధూత ఎర్రితాత ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉట్లమాను పరుష ఉత్సాహంగా సాగింది. ఉట్లమాను ఎక్కేందుకు యువకులు పోటీపడ్డారు. పెద్దఎత్తున జనం తరలివచ్చి తిలకించారు. అంతకుముందు ఎర్రితాతకు ప్రత్యేక పూజలు చేశారు. చత్రప్రభ అలంకారంలో స్వామి.. భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి భజనలతో ఉత్సవాలు ముగిశాయి.

గ్యాస్ నిక్షేపాల వేట



అరకటవేముల వద్ద బోరువేస్తున్న ఓఎన్‌జీసీ సిబ్బంది

పుట్లూరు, జూన్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకటవేముల, ఏ. కొండాపురం గ్రామాల పొలాల్లో ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషిస్తున్నారు. ఆదివారం ఆయా గ్రామాల పరిధిలో బోరుబావులు తవ్వుతున్నారు. ఇప్పటికే మండలంలోని ఎస్. వెంగన్నపల్లి, నారాయణపల్లి, తక్కళ్లపల్లి, పుట్లూరు తదితర గ్రామాల్లో బోరుబావులు తవ్వారు. తాజాగా మరోసారి మండలంలో నిక్షేపాల కోసం తవ్వకాలు ప్రారంభించారు. గ్యాస్ నిల్వలపై ఓఎన్‌జీసీ అధికారులు వివరాలు వెల్లడించట్లేదు.

అనంతలో మోస్తరు వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వర్షం పడింది. అనంతపురం, పుట్లూరులో ఓ మోస్తారు వర్షం కురిసింది. పామిడి, గుత్తి, యాడికి, తాడిపత్రి, నార్పల తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

జగన్ మీడియాను నిషేధించాల్సిందే..

టీడీపీ నాయకులు, తెలుగు మహిళల డిమాండ్
అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన..

అనంతపురం అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జగన్ మీడియాను నిషేధించాల్సిందేనని టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. 'అమరావతి అమ్మలను అవమానించిన జగన్ మీడియాపై నిషేధం విధించాలనీ, షేమ్.. షేమ్ జగన్.. భారతిరెడ్డి మౌనం వీడాలి.. జగన్ ఏపీని వీడాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. తెలుగు మహిళలు స్వప్న, సంగా తేజస్విని మాట్లాడుతూ... అమరావతి ప్రాంత మహిళలను కించపరిచేలా మాట్లాడిన కొమ్మినేని శ్రీనివాసరావు జైలుకెళ్లి, బెయిల్‌పై వస్తే అదేదో విజయం సాధించినట్లు జగన్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. అమరావతిపై మొదటి నుంచి వైసీపీ కుట్రలు చేస్తోందన్నారు. మహిళలను వేశ్యలుగా చిత్రీకరిస్తూ పైశాచిక ఆనందం పొందడం దుర్మార్గమన్నారు. తక్షణమే భారతిరెడ్డి, జగన్‌రెడ్డి.. మహిళలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, సుధాకర్ యాదవ్, తెలుగు మహిళలు లక్ష్మీ నాయుడమ్మ, సరళ, కంఠాదేవి, వడ్డే భవాని పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు



జగన్ పత్రిక ప్రతులను దహనం చేస్తూ..

ట్రాన్స్‌కో ఏఈ అవినీతిపై విచారణ

బూతులతో బయటపడ్డ అక్రమాల లెక్కలు

కళ్యాణదుర్గం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న ఓ ఏఈ అవినీతిపై ఉన్నతస్థాయిలో విచారణ జరుగుతన్నట్లు తెలుస్తోంది. కళ్యాణదుర్గం ట్రాన్స్‌కోలో ఏడీ, ఏఈ మధ్య ఫోన్‌లో సాగిన బూతు తిట్లను ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు. దీంతో ఆ ఏఈ అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకొచ్చాయి. ఏఈ గత ఐదేళ్లకుపైగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనే పనిచేస్తూ.. ఇష్టారాజ్యంగా వ్యవహరించాడనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారిని సైతం ఫోన్లో ఇష్టానుసారంగా బూతులతో తిట్టాడంటే.. ఆయన ఏ స్థాయిలో బరితెగించాడో అర్థం చేసుకోవచ్చు. ఈ బూతులతో ఆయనను ఇటీవల అనంతపురం ప్రొటెక్షన్ సెక్షన్‌కు బదిలీ చేశారు. అంతటితో ఆగకుండా ఆయన అవినీతిపై పూర్తిస్థాయిలో విజిలెన్స్ అధికారులచే విచారణకు సిఫారసు చేసినట్లు తెలిసింది. ఆ ఏఈతో ట్రాన్స్‌కోలోని ఓ కాంట్రాక్టర్‌తో కుమ్మక్కైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో తమ నుంచి లంచం తీసుకున్నారని కళ్యాణదుర్గం మండలానికి చెందిన రైతులు ఎస్ఈ శేషాద్రిశేఖర్‌కు ఇటీవల ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఏఈకి నేరుగా రూ. 10 వేలు, కాంట్రాక్టర్‌కు ఫోన్ పే ద్వారా రూ. 10 వేలు ఇచ్చినట్లు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. దీంతో ఆ ఏఈపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఐదేళ్ల నుంచి ఆయన ఏయే మండలాల్లో పనిచేశారనే సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలిసింది. డీఈ మనస్థాపానికి గురై దీర్ఘకాలిక సెలవు పెట్టినా ఉన్నతాధికారులు మౌనం వహించారనే విమర్శలు ఉన్నాయి. 10 రోజుల పాటు ఏఈపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు మౌనం వహించారు. ఉన్నతాధికారులకు ఆధారాలతో ఏఈపై చర్యలు తీసుకోవాలని ఏడీ విన్నవించినా ఫలితం లేకపోయింది. సోషల్ మీడియా, పత్రికల్లో దావనంలా వ్యాపించడంతో ఉన్నతాధికారుల్లో చలనం కలిగింది. ఉన్నఫలంగా బదిలీ చేస్తూ చర్యలు తీసుకున్నారు.



ఏఈపై ఫిర్యాదులు వచ్చాయి

ట్రాన్స్‌కో ఏఈ అవినీతిపై కళ్యాణదుర్గం మండలానికి చెందిన కొంత మంది రైతులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసిన మాట వాస్తవమే. దీనిపై త్వరలోనే విచారణకు ఆదేశిస్తాం.

\- శేషాద్రిశేఖర్, ఎస్ఈ, అనంతపురం

ఐదేళ్లు దాటితే బదిలీనే..

సచివాలయ ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్స్‌కు మార్గదర్శకాలు
సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి
సిఫార్సుల కోసం పరుగులు



వార్డు సచివాలయం


హిందూపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 30వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. బదిలీల అనంతరం ఉద్యోగుల వివరాలను హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో వచ్చేనెల 10లోపు పొందుపరచాల్సి ఉంది. వార్డు, గ్రామ సచివాలయాల్లో ఈ ఏడాది మే 31 నాటికి ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులను బదిలీ చేస్తారు. ఉద్యోగుల హేతబద్ధీకరణతోపాటు బదిలీల ప్రక్రియ పూర్తిచేసేలా మార్గదర్శకాలు జారీచేసింది. సచివాలయ ఉద్యోగుల హేతబద్ధీకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు ఇచ్చింది. అందుకు క్లస్టర్‌ను పరిగణనలోకి తీసుకోనుంది. పట్టణాలు, పల్లెల్లో రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసింది. జనాభా నిష్పత్తిని బట్టి ఆరుగురు, ఎనిమిది మంది సిబ్బంది ఉండేలా మూడు కేటగిరీలుగా విభజించింది. క్లస్టర్ పరిధిలో సిబ్బంది హేతబద్ధీకరణను ప్రామాణికంగా తీసుకున్నారు. సర్వేయర్ ఒక సచివాలయంలో ఉంటే అదే క్లస్టర్‌లోని మరో దాంట్లోనూ విధులు నిర్వహించాలి. సర్వేయర్‌లేని సచివాలయాలకు కొత్త పోస్టింగ్ ఇప్పట్లో లేదు. సదరు క్లస్టర్ పరిధిలో సర్వేయర్ రెండు

(మిగతా 7లో...)

ఆ కుర్చీ మాకొద్దు..!

ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ బాధ్యతలకు అయిష్టత
మెడికల్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా రామస్వామినాయక్
కలెక్టర్, డీఎంఈ వద్దకు సీనియర్ డాక్టర్ల లిస్ట్

అనంతపురం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆసుపత్రికి మళ్లీ ఇన్‌చార్జ్ సూపరింటెండెంటే దిక్కుగా మారనున్నారు. ఆసుపత్రికి ఆది నుంచి ఇన్‌చార్జిలే ఎక్కువగా సూపరింటెండెంట్‌గా కొనసాగారు. రెగ్యులర్స్ రావడానికి ఇష్టపడడంలేదు. ఒకవేళ ఎవరైనా వచ్చినా పట్టుమని పదినెలలు కూడా ఉండడంలేదు. ఇక జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న సీనియర్ డాక్టర్లు కూడా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకోవడానికి ముందుకురావడం లేదు. దీంతో అనేకసార్లు సీనియర్లు ఉన్నా జూనియర్ డాక్టర్లు సూపరింటెండెంట్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సూపరింటెండెంట్ కుర్చీ అంటే ఏ స్థాయిలో భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పదవిపై కిరికిరి సాగుతోంది. ప్రస్తుతం రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు సాధారణ బదిలీలలో కడప జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా వెళ్లారు. ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. వెంకటేశ్వరరావు గతంలోనూ ఇక్కడ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గాను పనిచేశారు. పదోన్నతి రావడంతో రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా రెండున్నరేళ్ల క్రితం ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం బదిలీ చేయడంతో రిలీవ్ అయ్యారు. ఆ స్థానంలో ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వడానికి కలెక్టర్, రాష్ట్రస్థాయిలో డీఎంఈ సైతం కుస్తీ పడుతున్నారు. నిబంధనల మేరకు సీనియర్ ప్రొఫెసర్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. ఇక్కడ సీనియర్ వైద్యులు రామస్వామినాయక్, ఆత్మారామ్, నవీన్‌కుమార్, షంషాద్‌బేగం, సూపర్‌స్పెషాలిటీ డాక్టర్ భాస్కర్ ఉన్నారు. మెడికల్‌కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుంటూరు జీజీహెచ్ నుంచి సత్యనారాయణను బదిలీ చేశారు. ఆయన ఇక్కడికి రాలేదు. ప్రస్తుత ప్రిన్సిపాల్ మాణిక్యాల రావు రలీవ్ కావడంతో.. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా రామస్వామినాయక్ బాధ్యతలు తీసుకున్నారు. ఇక మిగిలిన సీనియర్లు సూపరింటెండెంట్ ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకోవడానికి విముఖత చూపిస్తున్నారని వైద్యవర్గాలు చర్చించుకుంటున్నాయి. వీళ్లందరికి సొంత నర్సింగ్ హోమ్స్, ఆసుపత్రులు ఉన్నాయి. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకుంటే ఇబ్బంది పడాల్సి వస్తుందని, మరోవైపు రాజకీయంగా ఒత్తిళ్లు ఉంటాయని ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకుంటున్నట్లు సమాచారం. కలెక్టర్, డీఎంఈ సీనియర్ డాక్టర్ల జాబితాను తెప్పించుకున్నారు. ఇన్‌చార్జ్ బాధ్యతలపై సోమవారం ఉత్తర్వులు వచ్చే అవకాశాలు ఉన్నాయని చర్చించుకుంటున్నారు. ఎవరికి ఇన్‌చార్జ్ అప్పగిస్తారోనని ఆ వర్గాల్లో టెన్షన్ నెలకొంది.



సూపరింటెండెంట్ కుర్చీ

విద్యార్థులూ.. ఎంపిక మీదే...!

- 209 కళాశాలలు, 84,988 సీట్లు మీకోసమే..
- డిప్లొమో, డిగ్రీ, బీటెక్, ఫార్మసీలో అడ్మిషన్లు
- కోర్సు ఏదైనా భవిష్యత్తుకు బాటలు
- కోర్సులు అందిస్తున్న జేఎన్టీయూ, ఎస్కేయూ, సెంట్రల్ వర్సిటీలు
- టెక్నాలజీని జోడిస్తున్న ప్రభుత్వం
- ప్రవేశాల కల్పనకు విద్యాశాఖ కసరత్తు
- ఇప్పటికే ఈఏపీసెట్, పాలిసెట్ ఫలితాలు
- డిగ్రీ ప్రవేశాలకు త్వరలోనే షెడ్యూల్

అనంతపురం సెంట్రల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించే సమయం వచ్చేసింది. అడ్మిషన్లకు కళాశాలలు సిద్ధమవుతున్నాయి. వారికోసం 209 కళాశాలలు, 84,988 సీట్లు ఎదురుచూస్తున్నాయి. సమాజంలోని వివిధ రంగాల్లోకి అడుగు పెట్టేందుకు, తనదైన ముద్రవేసుకునేందుకు విద్యార్థికి కళాశాల ఒక వేదిక అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆ అవకాశాన్ని విద్యార్థులకు కల్పించేలా రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో..

(మిగతా 7లో..)

క్రైం కార్నర్

ఆవుకోసం.. ప్రాణ త్యాగం..!

● విద్యుత్‌షాక్ గురైన ఆవు.. తప్పించబోయి పాడిరైతు మృతి



జూటూరు యర్రప్ప(ఫైల్)

కనగానపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మనకు ఇష్టమైనది దూరమయితే మనసులో వెలితిగా ఉంటుంది. అది వస్తువైనా, మనుషులైనా, మూగజీవాలైనా ఒకటే. కళ్ల ముందర తను సాకుతున్న ఆవు విద్యుత్‌ఘాతానికి గురై తల్లడిల్లుతుంటే కాపాడబోయి షాక్‌గురై ఓ పాడిరైతు మృతి చెందిన విషాదకర సంఘటన ఆదివారం కనగానపల్లి మండలం సీఎన్‌కోట గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన జూటూరు యర్రప్ప(65) ఆవులు మేపుతూ జీవిస్తున్నాడు. మేతకు వెళ్లిన ఆవులు ఆంథోని అనే రైతు పొలంలోకి వెళ్లాయి. గాలీవానకు నేల మీద పడిన విద్యుత్ తీగలు ఓ ఆవు కాళ్లకు తగిలాయి.



ప్రాణాలతో బయటపడిన ఆవు

వెంటనే ఆవు విద్యుదాఘాతానికి గురై తల్లడిల్లడం చూసిన యర్రప్ప దానిని కాపాడే క్రమంలో తను షాక్‌కు గురై చనిపోయాడు. స్థానికులు గమనించి విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేయించి చూడగా అప్పటికే యర్రప్ప మృతి చెందాడు. షాక్‌కు గురై బావిలో పడ్డ ఆవును రైతులు బయటికి తీశారు. యర్రప్పకు భార్య లక్ష్మీదేవితో పాటు ఐదుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. కనగానపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మహిళారైతు ఆత్మహత్య



సుజాతమ్మ (ఫైల్)

ఆత్మకూరు, జూన్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరిదిండ్ల గ్రామానికి చెందిన మహిళా రైతు సుజాతమ్మ(55) అప్పుల బాధతో ఆదివారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సు జాతమ్మ పంటలు సాగు చూస్తూ జీవనం సాగించేది. పంటలు గిట్టుబాటు కాక నష్టపోయింది. పెట్టుబడులకు తెచ్చిన అప్పులు రూ.5 లక్షలకు చేరాయి. వాటిని తీర్చే మార్గం కనిపించక ఇంట్లోనే ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. కాసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు.. పోలీసులకు సమాచారం అం దించారు. ఈమె భర్త కొన్నేళ్ల క్రిత మరణించాడు. కుటుంబ భారం సుజాత మ్మ మోస్తుండేవారు. పిల్లలను పోషించి, వివాహాలు చేసింది. కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుజాతమ్మ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు.

బోగస్ లబ్ధిదారుల ఏరివేతకు శ్రీకారం

ఏళ్ల తరబడి ఇళ్ల నిర్మాణం చేపట్టని వారికి నోటీసులు



పునాదికి అతికించిన నోటీసు

రాయదుర్గం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పునా ది దశలో ఉండి.. ఇంటి నిర్మాణా లు చేపట్టని ఇళ్ల లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. పదేళ్ల క్రితం నుం చి ప్రభుత్వం పట్టణంలోని నిరుపేదలకు భూమి కొనుగోలు చేసి నివాసస్థలాలను మంజూరు చేసింది. వాటిలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి గృహనిర్మాణశాఖ అనుమతులు ఇవ్వడంతో పాటు గృహనిర్మాణానికి రుణాలు కూడా ఇచ్చింది. అయితే లబ్ధిదారులు ఇంటిని పునాది దశ వరకు నిర్మించి.. ఏళ్ల తరబడి వదిలేశారు. ప్రధానంగా బినామీ పేర్లతో పొందిన నివాసస్థలాలను ఇప్పటికే రూ. లక్ష నుంచి రూ. 1.5 లక్షల వరకు విక్రయించి.. సొమ్ము చేసుకున్నారు. అలాంటి బోగస్ లబ్ధిదారులను ఏరివేయడమే లక్ష్యంగా పట్టణంలోని 14 లేఅవుట్‌లలో 724 మంది లబ్ధిదారులకు నోటీసులను జారీ చేశారు. అందుబాటులో లేని వారికి ఆయా పునాదులకు ఆ నోటీసులు అతికిస్తున్నారు. ఒక్కసారిగా నోటీసులు జారీ చేయడంతో కొనుగోలు చేసిన వారు ఉలిక్కిపడి రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే నోటీసుల జారీ ప్రక్రియ చివరిదశకు చేరుకున్నట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

అంగన్‌వాడీ వర్కర్ల ధర్నా వాయిదా

అనంతపురం కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు చేపట్టాల్సిన అంగన్వాడీల ధర్నాను వాయిదా వేసినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న ధర్నా నేపథ్యంలో అంగన్వాడీల డిమాండ్ల పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందనీ, ఈ నేపథ్యంలోనే అధికారుల సూచనల మేరకు ధర్నాను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

ఆశాజనకంగా పశువుల సంత ఆదాయం

అనంతపురంరూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లోని పశువుల సంత ఆదాయం ఈవారం ఆశాజనకంగా ఉంది. గత వారంతో పోలిస్తే ఈవారం ఆదాయం మరింత పెరిగింది. గతవారం బక్రీద్ పండుగ నేపథ్యంలో వ్యాపారులు మార్కెట్‌కు రావడం తగ్గింది. కొనుగోళ్లు మందగించాయి. ఈక్రమంలో గతవారం సంత ఆదాయం తగ్గిపోయింది. ఈవారం పశువుల సంత వ్యాపారులతో కళకలాడింది. జీవాలు పెద్ద సంఖ్యలోనే వచ్చాయి. సంత నుంచి మార్కెట్ కమిటీకి ఆదాయం పెరిగింది. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో 2,81,200, ఆదివారం జరిగిన ఎద్దులు, ఎనుముల సంతతో రూ.1,50,300 మార్కెట్‌కు వచ్చింది. రెండురోజుల సంతతో రూ.4,31,500 మార్కెట్‌కు వచ్చినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

విద్యార్థులూ.. ఎంపిక మీదే..!

(5వ పేజీ తరువాయి)

డిగ్రీ, డిప్లొమో, బీటెక్, ఫార్మసీ ప్రవేశాలు కల్పిస్తోంది. ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మసీ.. కోర్సు ఏదైనా విద్యార్థి భవిష్యత్తుకు బాటలు వేసేలా ఉన్న తీకరిస్తోంది. జాతీయస్థాయిలో పేరుగాంచిన జేఎన్టీయూ, ఎస్కేయూ, సెంట్రల్ వర్సిటీలు వాటి పరిధిలో కోర్సులను అందిస్తున్నాయి. ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సు ఏదైనా విద్యార్థి భవిష్యత్తుకు బాటలు వేస్తాయని, ప్రతి కోర్సుకు టెక్నాలజీ అంశాన్ని జోడించి ఉద్యోగ, ఉపాధి కల్పించేలా విద్యాశాఖ చర్యలు తీసుకుందని అధికార వర్గాలు వివరిస్తున్నాయి. ఇప్పటికే ఈఏపీసెట్, పాలిసెట్ ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసి ర్యాంకులను ప్రకటించింది. ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టాలి. డిగ్రీ ప్రవేశాల కోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల అవుతుందని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల సంఖ్య		
కోర్సు	ప్రభుత్వ	ప్రైవేట్
డిగ్రీ	13	62
బీటెక్	3	73
ఫార్మసీ	2	39
పాలిటెక్నిక్	11	6
మొత్తం	29	180
కన్వీనర్ కోటాకింద సీట్ల సంఖ్య		
డిగ్రీ	7376	28043
బీటెక్	1448	39310
ఫార్మసీ	206	3905
పాలిటెక్నిక్	2123	2574
మొత్తం	11153	73835

209 కళాశాలలు.. 84,988 సీట్లు..

జేఎన్టీయూ, ఎస్కేయూ పరిధిలోని 192 డిగ్రీ, బీటెక్, ఫార్మసీ కళాశాలలతోపాటు 17 పాలిటెక్నిక్ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 84,988 సీట్లను కేటాయించారు. బీటెక్, ఫార్మసీకి ఈఏపీసెట్, పాలిటెక్నిక్ ప్రవేశాలకు పాలిసెట్‌ను నిర్వహించి ఫలితాలను విడుదలచేశారు. డిగ్రీ అడ్మిషన్లకోసం రాష్ట్ర విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. గత ప్రభుత్వంలో సింగిల్ మేజర్, మెయిన్ సబ్జెక్టుల ప్రక్రియను ప్రవేశపెట్టారు. ఈ ప్రక్రియద్వారా విద్యార్థులు నష్టపోతున్నారని, ప్రధానంగా రెండు సబ్జెక్టులు అభ్యసిస్తేనే డిగ్రీలో పట్టా సాధించగలరని రాష్ట్ర విద్యాశాఖ యోచిస్తోంది. మొత్తం ప్రవేశాల ప్రక్రియను వచ్చేనెలలో పూర్తిచేసే అవకాశాలున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

రూ.1000 కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం

విద్యార్థులకు డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పాలిటెక్నిక్ కోర్సులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి దాదాపు రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తోంది. 75 డిగ్రీ, 76 బీటెక్, 42 ఫార్మసి, 17 పాలిటెక్నిక్ మొత్తం 209 కళాశాలల్లో చదువున్న విద్యార్థులకు ఈ మొత్తాన్ని వెచ్చిస్తోంది. బీటెక్, ఫార్మసీ నాలుగు, పాలిటెక్నిక్ మూడు సంవత్సరాల పాటు కోర్సులు అభ్యసించాలి. కన్వీనర్ కోటాకింద ప్రవేశాలు పొందిన ప్రభుత్వ కళాశాలలోని 11,153 మంది, ప్రైవేట్ కళాశాలల్లోని 73,835 మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అదనంగా కోర్సుల కాలంలో వసతి కోసం వెచ్చించే ఖర్చును స్కాలర్‌షిప్ రూపంలో ఇస్తోంది. ఒక్క జేఎన్టీయూ, ఎస్కేయూ పరిధిలోనే ప్రతి సంవత్సరం 84,988 మందికి కన్వీనర్ కోటాకింద నూతన ప్రవేశాలు కల్పిస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లిస్తోంది. జేఎన్టీయూ, ఎస్కేయూ క్యాంపస్‌లో ప్రత్యేక నైపుణ్య కేంద్రాలను ఏర్పాటుచేస్తోంది. కోర్సుల కాలంలోనే ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు చేయించి ఉద్యోగాలకు అవసరమైన మెళుకువలు, నైపుణ్యాలను పెంపొందిస్తోంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విధిగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

ఉన్నతంగా ఎంపిక చేసుకోవాలి



విద్యార్థి భవిష్యత్ విజయతీరాలకు చేరాలంటే లక్ష్యాలను ఉన్నతంగా ఎంపికచేసుకోవాలి. ఇంటర్ అనంతరం డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ ఏదైనా ప్రొఫెషనల్‌గా అభ్యసించాలి. ఏ రంగంలో రాణించాలన్నా అవసరమైన పరిజ్ఞానాన్ని, మెళుకువలను పెంపొందిచుకోవాలి. వీటన్నిటికి కళాశాల కీలకమైనది. ప్రవేశాలు పొందే ముందు కళాశాలలను సందర్శించి ప్రమాణాల స్థాయిని పరిశీలించాలి. కోర్సులకు అనుగుణంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టెక్నికల్, డిజిటల్, ప్లేస్‌మెంట్ స్టాటిక్స్ తదితర విషయాలు తెలుసుకోవాలి. ఉన్నత విద్యనందించి ఉద్యోగ, ఉపాధి అకాశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిత్యనూతన సంస్కరణలు తీసుకువస్తోంది.

-ప్రొఫెసర్ సుదర్శనరావు, వీసీ, జేఎన్టీయూ

టెక్నాలజీ అనుసంధానం



ఎస్కేయూ పరిధిలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ అందుబాటులో ఉన్నాయి. ప్రతి కోర్సులోనూ టెక్నాలజీని అనుసంధానించేలా ఒక సబ్జెక్టును జోడిస్తున్నాం. దీంతో ఆర్ట్స్, సైన్స్‌తోపాటే ఏక కాలంలో కంప్యూటర్ సైన్స్‌ను అభ్యసించవచ్చు. ఎస్కేయూ అనుబంధంగా 13 ప్రభుత్వ, 73 ప్రైవేట్ డిగ్రీ కళాశాలు ఉన్నాయి. వీటిలో 40కి పైగా కోర్సులు ప్రవేశపెట్టి 30వేలకు పైగా విద్యార్థులు ప్రవేశాలు పొందేలా సీట్లు కేటాయించాం. డిగ్రీ చివరి సంవత్సరంలో ప్రాజెక్టులు చేసేలా ఒక సెమిస్టర్ కాలాన్ని కంపెనీల్లో శిక్షణ పొందేందుకు విద్యార్థులకు అవకాశాన్ని కల్పించాం. సమాజానికి మానవ వనరులందించే సంస్థలా ఎస్కేయూ ఎప్పటికప్పుడు విద్యార్థులకు కొత్తబాటలు వేస్తోంది.

- ప్రొఫెసర్ అనిత, ఇన్‌చార్జ్ వీసీ, ఎస్కేయూ

అన్ని రకాల కోర్సులు అందిస్తున్నాం



సాంకేతిక యుగంలో అన్నిరంగాల్లోనూ విద్యార్థులు రాణించేలా కోర్సులను డిజైన్‌చేసి అందిస్తున్నాం. వర్సిటీ క్యాంపస్‌లో చదివేందుకు ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు పోటీపడుతున్నారు. పలు భాషలు, ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఒకే క్యాంపస్‌లో ఉండటంతో సర్వసాధారణగా కమ్యునికేషన్ స్కిల్స్ డెవలప్ అవుతున్నాయి. రిటైల్ మేనేజ్మెంట్, ఐటీ, టూరిజం, ట్రావెల్ మేనేజ్మెంట్, ఎకనామిక్స్, తెలుగు, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, గణితం, సైకాలజీ, మాలిక్యులర్ బయాలజి, జియోగ్రఫి, సంస్కృతం, హిందీ, మేనేజ్మెంట్, కామర్స్, కమ్యునికేషనల్ సోషల్ సైన్స్ వంటి కోర్సులను డిగ్రీ, పీజీ ద్వారా అందిస్తున్నాం. విద్యార్థులు వారి అభిరుచి మేరకు కోర్సుల్లో ప్రవేశించవచ్చు. -ప్రొఫెసర్ కోరి, వీసీ, సెంట్రల్ వర్సిటీ

మొరాయించిన తిరుపతి ప్యాసింజరు

● రెండు గంటలు ఆలస్యం



గూళ్యపాళ్యం స్టేషన్‌లో నిలిచిపోయిన తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు రైలు

గుంతకల్లు, జూన్15(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి కదిరిదేవరపల్లి వెళ్లే ప్యాసింజరు (నం. 57405) రైలింజను ఆదివారం ఉదయం గూళ్యపాళ్యం రైల్వేస్టేషన్‌లో మొరాయించింది. ఈ రైలు ఉదయం 7.20 గంటలకు రావాల్సి ఉండగా.. అరగంట ఆలస్యంగా వచ్చింది. ఈ స్టేషన్‌లో రైలింజన్ మొరాయించడంతో ఈ ప్యాసింజరు రైలును నిలిపివేశారు. దాదాపు రెండున్నర గంటలసేపు రైలు ఆగిపోయింది. గుంతకల్లు నుంచి ప్రత్యామ్నాయ రైలింజన్‌ను పంపడంతో ఉదయం 10.30 సమయంలో కదిరిదేవరపల్లి రైలును గుంతకల్లుకు చేర్చారు. ఈ ప్యాసింజరు కారణంగా కలబురగి-బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆంతరాయం ఏర్పడింది.

ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామమోహన్‌రెడ్డి

అనంతపురం అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రొహిబిషన్, ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడిగా అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని ఓ హోటల్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాక్షుడిగా రామమోహన్ రెడ్డి విజయం సాధించారు. రెండేళ్లపాటు నూతన కమిటీ కొనసాగుతుంది. రామమోహన్‌రెడ్డికి ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

నగదు ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదోతరగతిలో 80శాతం పైగా మార్కులు సాధించిన తొగటవీర క్షత్రియ విద్యార్థులు నగదు ప్రోత్సాహక బహుమతులకు దరఖాస్తు చేసుకోవాలని తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాసరి శ్రీధర్ ఆదివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. నగదు ప్రోత్సాహకాల కోసం దరఖాస్తు చేసుకోదలచినవారు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉండాలని, ఎస్ఎస్‌సీ మార్కుల జాబితాతో పాటు కులధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో జూలై 10వ తేదీ లోపు చౌడేశ్వరిదేవి కల్యాణభవన్, విజయనగర్ కాలనీ, బెంగళూరురోడ్డు, అనంతపురం చిరునామాకు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 8555967072, 9440878484 నెంబర్లను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. గడువులోపు పంపని దరఖాస్తులను అనర్హులుగా పరిగణిస్తామన్నారు. అర్హత సాధించిన విద్యార్థులకు జూలై 24వ తేదీన చౌడేశ్వరి కల్యాణ భవన్‌లో నిర్వహించే సభలో నగదు పురస్కారాలు అందజేస్తామని వివరించాన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు ఫైనల్ రౌండ్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ వన్డే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో భాగంగా సోమవారం ఫైనల్ రౌండ్ పోటీలు అనంతపురం క్రీడాగ్రామంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి భీమలింగారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. గ త వారం రోజులుగా జరుగుతున్న పోటీల్లో నెల్లూరు జట్టు 12పాయింట్లతో ప్రథమస్థానంలో నిలవగా.. అనంతపురం 8 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే చిత్తూరు, కడప చెరో 6పాయింట్లతో నిలిచాయన్నారు. సోమవారం ఫైనల్ రౌండ్‌లో అనంతపురం-నెల్లూరు, కడప-కర్నూలు జట్ల మధ్య పోటీలు జరగనున్నట్లు చెప్పారు.

కరువు, ఎడారీకరణ నివారణపై రేపు సదస్సు



మాట్లాడుతున్న ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దేశంలోనే కరువు, ఎడారీకరణకు నిలయంగా మారిన ఉమ్మడి అనంతపురం జిల్లా పరిస్థితులను కేంద్రస్థాయిలో తెలియజేసేందుకు ఈనెల 17న పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో జాతీయస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు 1994 నుంచి జూన్ 17వతేదీన ప్రపంచ కరువు, ఎడారీకరణ నివారణ దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో జరుపుకుంటున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో నేలలు, కరువు, ఎడారీకరణ, వాతావరణంలోని మార్పులు ఆధారంగా ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. గాలి, నీరు కలుషితమైన నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు ప్రకృతి వ్యవసాయమే పరిష్కారమార్గమని తెలిపారు. అడవులను తలపించేలా విరివిగా మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, చెట్లను పరిరక్షించడం మనందరి బాధ్యత అని వివరించారు. ఈ క్రమంలోనే నిర్వహించే జాతీయ సదస్సుకు శాస్త్రవేత్తలు, ప్రముఖులు హాజరై వివరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎఫ్ ఎకాలజీ సీఈఓ మురళీకృష్ణ, కోఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

'తల్లికి వందనం' స్టేటస్ తెలుసుకోండిలా..

కొత్తచెరువు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న పిల్లలకు తల్లికివందనం పథకాన్ని వర్తించేలా నిర్ణయం తీసుకుంది. ఈ పథకాన్ని 12 వతేది అమలులోకి తెచ్చింది. శుక్రవారం నుంచే రూ.13 వేల చొప్పున తల్లుల ఖాతాలకు నగదు జమ అవుతోంది. స్మార్ట్ ఫోన్‌లో తల్లికివందనం పేమెంట్, స్టేటస్ తెలుసుకొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్ gswsnbm.ap,gov.in/N-BM/#!/ అప్లికేషన్ స్టేటస్ చెకప్‌ను తీసుకువచ్చింది. మొబైల్‌లో ఈ యాప్‌పై క్లిక్ చేయగానే ఎన్‌బీఎం అప్లికేషన్ స్టేటస్ అని చూపిస్తుంది. స్కీమ్(పథకం): తల్లికివందనం, సంవత్సరం: 2025-2026, యుఐడి: తల్లి, తండ్రి, సంరక్షుల ఆధార్ నెంబర్ నమోదు చేయాల్సి ఉంటుంది. తరువాత స్రీన్‌పై చూపిస్తున్న అంకెలను నమోదు చేయాలి. తరువాత మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని నమోదు చేయగానే స్కీమ్, అప్లికేషన్, పేమెంట్ వివరాలు స్క్రీన్‌పై కనబడతాయి. దీంతో పథకం వర్తించిందా లేదా అని తెలుసుకోవచ్చు. తల్లికివందనం పథకం వర్తించని, అనర్హుల జాబితాలో పేర్లు ఉన్నవారు తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లోని అధికారులకు ఈనెల 20 తేదీలోగా అర్జీలు అందజేయాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

అనుమతుల్లేకుండా ఆందోళనలు చేస్తే చర్యలు : ఎస్పీ

పుట్టపర్తిరూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సభలు, సమావేశాలు, ఆందోళనలు చేయాలంటే తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్పీ వి.రత్న సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టరాదని, 30 యాక్టు అమలులో ఉందని వివరించారు. మహిళలు, చిన్నారులతో పాటు తల్లిదండ్రులు లేని పిల్లలు, ఒంటరి మహిళల పట్ల జరిగే నేరాలు అరికట్టడానికి శక్తిటీంలు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తియాప్‌ను వినియోగించుకోవాలన్నారు. శక్తియాప్ వాట్సాప్‌నెంబరు 7993485111 ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈనెంబర్ 24/7 ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. అదే విధంగా డయల్ 100, 112, 1930, 1098 నెంబర్లకు కాల్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ తెలిపారు. నేరరహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పోలీసులకు సహకారం అందించాలని ఎస్పీ కోరారు.

ఐదేళ్లు దాటితే బదిలీనే..

(5వ పేజీ తరువాయి)

సచివాలయాల బాధ్యతలు నిర్వహిస్తారు. మిగులు సిబ్బందిని ఇతర మండలాలకు పంపిస్తారు. అవసరం లేదనుకుంటే అదే సచివాలయంలో పనిచేయవచ్చు. ఇప్పటికే సచివాలయాల్లో అందుకు అనుగుణంగా పోస్టింగ్‌లు ఖరారు చేశారు. ఇదే పోస్టింగ్‌లో ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగి ఉంటే వేరేచోటికి బదిలీ చేస్తారు. సదరు పోస్టింగ్‌కు ఇతర సచివాలయం నుంచి బదిలీ చేస్తారు. ఐదేళ్లు పూర్తికాకపోయినా కొన్నిచోట్ల సిబ్బందిని బదిలీచేసే అవకాశం ఉంది.

సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధం

సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది అధికశాతం ఇతర ప్రాంతాలకు చెందినవారున్నారు. ఐదేళ్లు పూర్తి కావడంతో వారు సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు స ుముఖత చూపుతున్నారు. జిల్లాలో పనిచేస్తున్న వారిలో అధికశాతం మంది పక్కజిల్లాల వాసులున్నారు. ఐదేళ్లు పూర్తయినవారు సొంత జిల్లాకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. సచివాలయ ఉద్యోగులు చాలామంది యువత ఉండటంతో అ లాంటివారు ఇటీవల ఉద్యోగాలు సాధించినతరువాత పెళ్లిళ్లు చేసుకున్నారు. దీంతో భార్యఒకచోట.. భర్త మరోచోట ఉండటంతో వారంతా బదిలీలకు సిద్ధమవుతున్నారు.

దివ్యాంగులకు తొలి ప్రాధాన్యత

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత కల్పించారు. వారు కోరుకున్న చోటుకి బదిలీ చేయనున్నారు. దృష్టిలోపం, వినికిడి, ఇతర సమస్యలున్న దివ్యాంగులకు తొలి ప్రాధాన్యత కల్పిస్తూ ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. దృష్టిలోపం ఉన్న ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. సదరు ఉద్యోగి విజ్ఞాపన మేరకు బదిలీ చేయాలని నిర్ణయించారు. కోరుకున్నచోట ఖాళీగా ఉండాలి. ఇలా పలు మార్గదర్శకాలు సూచించారు. దీనికి అనుగుణంగానే బదిలీలు చేయాల్సి ఉంది. ఈ బదిలీలు మున్సిపాలిటీల వారీగానా, జిల్లా ప్రాతిపదికనా.. అనేది ఇంకా తెలియాల్సి ఉంది.

సిఫార్సుల కోసం క్యూ

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యే కార్యాలయాల వద్దకు క్యూ కడుతున్నారు. తమకు కావాల్సిన చోటుకి బదిలీ చేయించుకునేందుకు సిఫార్సు లేఖల కోసం వెళ్తున్నారు. అధికశాతం మంది పక్క జిల్లాకు చెందినవారు ఉండటంతో ఇక్కడి నుంచి సిఫార్సు తీసుకోవడం, ఇక్కడికి వచ్చేవారు కూడా స్థానిక ఎమ్మెల్యేల లేఖ కోసం వెళ్తున్నారు. మరికొంతమంది మండల, పంచాయతీ స్థాయి నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఏది ఏమైనా ఐదేళ్ల తరువాత బదిలీలకు శ్రీకారం చుట్టడంతో సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి కేంద్ర కమిటీల పర్యటన

● నేషనల్ వాటర్ అవార్డు, నేషనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీల రాక
● అధికారులతో డ్వామా పీడీ సమీక్ష

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 17వ తేదీ నుంచి రెండు కేంద్ర కమిటీలు పర్యటించనున్నాయి. నేషనల్ వాటర్ అవార్డ్స్ కమిటీ, నేషనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీలు రానున్నట్లు డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. కేంద్ర అధికారుల పర్యటనపై ఆదివారం స్థానిక డ్వామా కార్యాలయంలో పీడీ సమీక్షించారు. నేషనల్ వాటర్ అవార్డ్స్ కమిటీ ఈనెల 17న మధ్యాహ్నం జిల్లాకు చేరుకుంటుందని, అదే రోజు కలెక్టర్‌తో జిల్లాలో అమలు చేస్తున్న నీటి నిర్వహణకు సంబంధించిన పనులపై సమీక్షిస్తుందని తెలిపారు. 18, 19వ తేదీలలో క్షేత్ర స్థాయిలో అధికారుల బృందం పర్యటిస్తుందన్నారు. నేషనల్ వాటర్ అవార్డ్స్ కమిటీలో సెంట్రల్ వాటర్ కమిషన్ డీడీ శంకర్, శాస్త్రవేత్త గౌతమ్ ఉన్నారన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి నబనీతదాస్ నేతృత్వంలోని నేషనల్ మానిటరింగ్ కమిటీ ఈనెల 18, 19, 20, 21వతేదీలలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఉపాధి, వాటర్ షెడ్ పనులు, రికార్డులను పరిశీలిస్తుందని తెలిపారు. ఉపాధి కూలీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, చేసిన పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడుతారని వివరించారు. కార్యక్రమంలో డ్వామా అడిషినల్ పీడీ సుధాకర్‌రెడ్డి, సీటీ ఏపీడీ విజయ్‌కుమార్, ఫైనాన్స్ మేనేజర్ రాధా తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర కమిటీల పర్యటనపై సమీక్షిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం వివిధ పూజలు జరిపారు. వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బాబు, ప్రధాన అర్చకులు రాము, స్వామి తదితరుల పాల్గొన్నారు.

మొక్కలు నాటి.. సంరక్షిద్దాం

● టీడీపీ జిల్లా నాయకుడు ఆలం వెంకట నరసానాయుడు


క్రీడామైదానాన్ని శుభ్రం చేయిస్తున్న ఆలం వెంకట నరసానాయుడు

నార్పల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని టీడీపీ జిల్లా నాయకుడు ఆలం వెంకట నరసానాయుడు సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానం ప్రహరీని గుర్తు తెలియని వ్యక్తులు తరచూ పడగొడుతుండడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఆలం వెంకట నరసానాయుడు ఆదివారం ఆ పాఠశాల ప్రహరీ చుట్టూ, అదేవిధంగా కేజీబీవీ వెనకవైపు ప్రహరీ పక్కన మొక్కలను నాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కలను నా టి సంరక్షిస్తే అవి చెట్లుగా మారతాయని, అప్పుడు క్రీడా మైదానంలోకి ద్విచక్రవాహనాలు, జంతువులు రావడానికి అవకాశం ఉండదని అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రహరీకి చెట్లు రక్షణగా నిలుస్తాయని తెలిపారు. బడి, గుడి అందరి ఆస్తి అని, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని పేర్కొన్నారు. తర్వాత క్రీడామైదానంలో ఉన్న చెత్తచెదారాన్ని ఎక్సకవేటర్ ద్వారా తొలగింపజేశారు.

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం సిండికేట్‌నగర్ సమీపంలోని క్రిష్ణానగర్‌లో పరిధిలో గల ఓ వ్యభిచార గృహంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. నిర్వాహకురాలు రెడ్డెమ్మను, ఓ విటుడిని అరెస్టు చేశారు. ముగ్గురు యువతులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

మా పోరాటంతోనే తల్లికి వందనం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసీపీ నేతలు, కార్యకర్తలు

అనంతపురం క్రైం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ చేసిన పోరాటం కారణంగానే ఏడాది తరువాత రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై వైసీపీ ప్రచురించిన జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆదివారం ఆయన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. జగన్ సీఎంగా ఉన్నప్పుడు మేనిఫెస్టోను పక్కాగా అమలు చేశారన్నారు. ఐదేళ్లలో ప్రజలకు రూ.2.81లక్షల కోట్లు లబ్ధి చేకూర్చామన్నారు. అదే కూటమి ప్రభుత్వం ఏడాదిగా ఒక్క సూపర్ సిక్స్ హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. 67లక్షల మందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేశామని చెబుతున్నా.. వాస్తవానికి 37.70లక్షల మందికే ఇచ్చారన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ ఇస్తామని చెప్పి ఇప్పటివరకు అందించలేదన్నారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లోనూ అవినీతి జరుగుతోందని, అన్ని ప్రాంతాల్లో మద్యం, ఇసుక, మట్టి దోపిడీ సాగుతోందని అన్నారు. తోపుడుబండ్లకు గతంలో రూ.20 ఉంటే ఇప్పుడు రూ.40లు వసూలు చేస్తున్నారన్నారు., మార్కెట్‌యార్డు, మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఆదాయం రావడం లేదని, ఎటు వెళ్తోందని ప్రశ్నించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం, నాయకుడు మహాలక్ష్మి శ్రీనివాస్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విచారణ

శింగనమల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో జరిగిన నిధులు గోల్‌మాల్‌పై సోమవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ జరగనుందని ఎంపీడీఓ భాస్కర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గత వైసీపీ పాలనలో జరిగిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పంచాయతీలకు ఖర్చు చేసిన నిధుల వివరాలతో హాజరుకావాలని కోరారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేపడతారని, కావున అన్ని పంచాయతీల అధికారులు రికార్డులతో ఉదయమే హాజరుకావాలని హాజరుకావాలని తెలిపారు.

గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన

రామగిరి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామ సచివాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. అనంతపురం నగరానికి చెందిన మార్క్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పరిటాలసునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి శిబిరాన్ని ప్రారంభించారు. ఇందులో వైద్యులు 179 మందికి గుండెపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే సమస్య ఉన్న వారికి మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని మార్క్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత రామ్మూర్తినాయుడు, తెలుగుయువత అధ్యక్షుడు మండల లింగాశ్రీధర్‌నాయుడు, సామాజిక సేవా కార్యకర్త రామ్మోహన్‌చౌదరి, నాయకులు వడ్డిసుబ్బు, సుబ్బరాయుడు, శీన, రామాంజినేయులు, వెంకటరామిరెడ్డి, రమేశ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

వేరుశనగ సాగులో రైతన్న బిజీ..

● పదునుకావడంతోపాటు మృగశిర కార్తె ప్రారంభం
● ఇదే అదునుగా విత్తనాలు వేస్తున్న అన్నదాతలు
● పెట్టుబడికి అప్పులు చేసి మరీ సాగు చేస్తున్న వైనం

శింగనమల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షాలు వచ్చి పొలాలు పదును కావడంతో పాలు మృగశిర కార్తె ప్రారంభం కావడంతో రైతులు పొలం పనుల్లో బిజీ అయ్యారు. మృగశిర కార్తెలో విత్తనాలు వేస్తే పంటలు బాగా పండుతాయనే నమ్మకంతో చాలామంది వేరుశనగ విత్తనాలు విత్తడంలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది దాదాపు 2వేల హెక్టార్లలో వేరుశనగ సాగు చేయడానికి రైతులు ఇప్పటికే విత్తన కాయలు తీసుకున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. పదును వాన పడడం, మృగశిర కార్తె మొదలవడంతో ఇదే సమయమని భావించి రైతులు విత్తనాలు విత్తుతున్నారు. చిన్నజలాలపురం, మట్లగొంది, సొదనపల్లి, వెస్టునరసాపురం, గురుగుంట్ల, నాగులగుడ్డం, ఆకులేడు, నాగులగుడ్డం తండా తదితర గ్రామాల్లో ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. చాలామంది రైతులు చేతిలో డబ్బు లేకపోయినా అదునుకు పదును కావడంతో అప్పులు చేసి మరీ విత్తనం వేస్తున్నారు. ఈ సారైనా దేవుడు కరుణించి పంటలు బాగా పండితే అప్పులు తీర్చుకుంటామని వారు తెలుపుతున్నారు.


కనగానపల్లి మండలం కుర్లపల్లి వద్ద విత్తన వేరుశనగను శుద్ధి చేస్తున్న రైతు


శింగనమల మండలం చిన్నజలాలపురం వద్ద ట్రాక్టర్‌తో వేరుశనగను విత్తుతున్న రైతులు

● కనగానపల్లి: మండలంలోని చాలామంది రైతులు ప్రస్తుతం వేరుశనగ సాగులో బిజీ అయ్యారు. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు వచ్చినప్పటికీ వేరుశనగ సాగుచేయలేదు. ఇందుకు ఆర్థిక ఇబ్బందులే కారణమని తెలుస్తోంది. ఇప్పుడు బ్యాంకుల్లో పంటరుణాలు రెన్యువల్ చేసుకున్న రైతులకు పావలా వడ్డీ, రుణాలు పెంచడంతో వేరుశనగ కాయలు తెచ్చుకున్నారు. ప్రస్తుతం తల్లికి వందనం నగదు కూడా ఖాతాల్లో పడటంతో అందులో కొంత మొత్తాన్ని వేరుశనగ సాగుకు వెచ్చిస్తున్నారు. మృగశిర కార్తెలో పంట సాగు చేస్తే పంటలు బాగా పండుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దేవుడు కరుణిస్తే అప్పులు తీరుతాయి



నేను ప్రతి ఏడాది నా భూమితో పాటు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని మృగశిర కార్తెలోనే వేరుశనగ పంట సాగు చేస్తాను. అయితే గతంలో వర్షాలు సకాలంలో రాకపోవడంతో దిగుబడులు లేక తీవ్రంగా నష్టపోయా. ఈ ఏడాది వర్షాలు అదునులోనే వస్తుండడంతో మృగశిరకార్తెలోనే సాగు చేస్తున్నాం. ఈసారైనా దేవుడు కరుణిస్తే అప్పులు తీరుతాయి.

-ఏకిల రామాంజనేయులు, కౌలు రైతు, చిన్నజలాలపురం

సకాలంలో వర్షాలు వస్తే గట్టెక్కుతాం



నేను ప్రతి ఏడాడి 5 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేస్తా. ఈ ఏడాది మృగశిర కార్తె మొదటి వారంలోనే అదునుకు పదును కావడంతో వేరుశనగ విత్తనాలు విత్తుతున్నాం. పంట సాగు చేసిన తరువాత సకాలంలో వర్షాలు వస్తే దిగుబడులు బాగా వస్తాయి. లేకపోతే ప్రతి ఏటా మాదిరిగా నష్టపోక తప్పదు.

-పట్నం నగేశం, రైతు (చిన్నజలాలపురం)

పంటల సాగుకు ఇదే అదును



వేరుశనగతో పాటు ఇతర పంటలను సాగు చేసేందుకు మంచి అదును సమయం ఇదే. ఇప్పుడు విత్తనాలు విత్తితే పంటల దిగుబడి బాగా వస్తుంది. ఈ ఏడాది వర్షాలు బాగా వస్తాయని శాస్త్రవేత్తల ద్వారా తెలుస్తోంది. రైతులు వేరుశనగ పంట సాగు చేయడానికి ఆగస్టు వరకు అదును వుంది. పంట సాగు సమయంలో రైతులు వ్యవసాయాధికారుల సలహాలు తప్పక తీసుకోవాలి.

-అన్వేష్‌కుమార్, ఏఓ, శింగనమలం

'తల్లికి వందనం'పై ప్రశ్నించే అర్హత వైసీపీకి లేదు

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మండిపాటు



అనంతపురం అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అమలు చేసిన తల్లికి వందనం పథకంపై ప్రశ్నించే అర్హత వైసీపీ నాయకులకు లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం ఏయే నిబంధనలు అమలు చేసిందో.. అవే నిబంధనలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వైసీపీ హయాంలో ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలుంటే అంత మందికీ అమ్మఒడి డబ్బులు ఇస్తామని హామీ ఇచ్చారని, అ యితే చివరికి ఒకరికి మాత్రమే ఇచ్చి మిగతా వారికి మొండిచేయి చూపారని దుయ్యబట్టారు. అదే ఇప్పటి సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం డబ్బులు జమ చేశారని తెలిపారు. ఈ పథకంపై ప్రశ్నించే అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. గతంలో పాఠశాల నిర్వహణ, అభివృద్ధి కోసమంటూ ప్రతి విద్యార్థి నుంచి రూ.2వేలు తీసుకుని ఆ డబ్బులు ఎక్కడ ఖర్చు పెట్టారో చూపలేదన్నారు. అదే మంత్రి నారా లోకేష్ ఆ రూ.2వేలు ఏ పనికి ఖర్చు చేస్తున్నది స్పష్టంగా వివరించారని తెలిపారు. ఆ డబ్బులను మంత్రి తన ఖాతాలోకి వేసుకున్నారంటూ అసత్య ఆరోపణలు చేయ డం అవివేకమన్నారు. ఆరోపణలను నిరూపించాలని నారా లోకేష్ సవాల్ చేస్తే.. వైసీపీ నాయకులంతా పారిపోయారన్నారు. ఇప్పటికైనా వైసీపీ వారు తప్పును ఒప్పుకొని క్షమాపణలు చెప్పాలన్నారు. లేకపోతే అసత్య ఆరోపణలపై న్యాయపరంగా ముందుకు వెళతామని ఆయన హెచ్చరించారు.

గానగంధర్వుడికి స్వర నీరాజనం


పాటలు పాడుతున్న కళాకారులు

అనంతపురం కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం స్థానిక లలిత కళాపరిషత్‌లో కళాకారులు స్వర నీరాజనం పలికారు. తొలుత పరిషత్ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ ఎస్పీ బాలసుబ్రహ్మ ణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సంగీత విభావరిలో కళాకారులు ఎస్పీ బాలు పాటలను ఆలపిస్తూ స్వర నీరాజనం పలికారు. పరిషత్ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వీఆర్ఓ ప్రసా ద్, ర్యాంబో అస్లాంబాషా, లలితకళా పరిషత్ కార్యవర్గం సభ్యులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రాధాన్యమివ్వాలి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు అన్ని శాఖల్లో కీలక పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కోరారు. న గరంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం నిర్వహించి న సమావేశంలో ఆయన మాట్లాడారు. 1993లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ బి.ఆరోరా ఇచ్చిన ఆదేశాల మేరకు, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రప్రభుత్వం జరిపిన చర్చల్లో తీసుకున్న నిర్ణయం మేరకు ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులను అన్ని శాఖల్లో ప్రాధాన్యత గల పోస్టుల్లో నియమించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఉద్యోగులకు జరిగిన అన్యాయాలను సరిచేసి తగు స్థానాలు కేటాయించాలని తెలిపారు. అర్హత, సీనియారిటీ ప్రకారం ఆయా వర్గాల ఉద్యోగులకు అవకాశం కల్పించి ఇది మంచి ప్రభుత్వమని మరోసారి రుజువు చేసుకోవాలని ఆయన సూచించారు.

నిరుపయోగంగా పశువుల నీటి తొట్టెలు

● ఉపయోగంలోకి తేవాలంటున్న రైతులు



బండమీదపల్లిలో నీరు లేక నిరుపయోగంగా ఉన్న పశువుల నీటి తొట్టెలు

రాప్తాడు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి గ్రామంలో పశువుల తాగు నీటి కోసం గతంలో నిర్మించిన రెండు తొట్టెలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. పంచాయతీ అధికారులు ఆ తొట్టెలకు నీరు సరఫరా చేయకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వేసవిలో పశువులు, గొర్రెలు, మేకల దాహార్తి తీర్చడం కోసం ప్రస్తుత ప్రభుత్వం గ్రామాల్లో తొట్టెలు నిర్మిస్తోంది. ఇందుకు ఒక్కో తొట్టె నిర్మాణానికి దాదాపు రూ. 33 వేలు మంజూరు చేసింది. ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా దాదాపు 20 పశువుల నీటి తొట్టెలు నిర్మించారు. వాటికి నీరు కూడా సరఫరా చేస్తున్నారు. అయితే బండమీద పల్లితో పాటు మరి కొన్ని గ్రామాల్లో గతంలో నిర్మించిన నీటి తొట్టెలను మాత్రం ఉపయోగంలోకి తీసుకురావడం లేదు. గతంలో నిర్మించిన ఈ తొట్టెలకు కూడా నీరు సరఫరా చేసి ఉపయోగంలోకి తీసుకుని వస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఒక్కరూ మినహా అందరూ బదిలీ

శింగనమల జూన్15 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో జరుగుతున్న బదిలీల్లో మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఒక్కరూ మినహా అందరు బదిలీ అయ్యారు. గత నాలుగు రోజుల నుంచి జరుగుతున్న బదిలీల్లో ఇక్కడి తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య కణేకల్లుకు బదిలీ అయ్యారు. పుట్లూరు తహసీల్దార్‌గా ఉన్న శేషారెడ్డిని ఇక్కడికి వచ్చారు. ఇక ఇక్కడి డిప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్‌రావును నార్పలకు, కూడేరు డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. అలాగే ఇక్కడి రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పునీత్‌బాబును అనంతపురం రూరల్‌కు, బుక్కరాయసముద్రం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామిని ఇక్కడికి బదిలీ చేశారు. అదేవిధంగా ఏఎస్ఓ నాగలక్ష్మిని బుక్కరాయసముద్రంకు గుంతకల్లు ఏఎస్ఓను సుభాషిణిని ఇక్కడకు నియమించారు. ఇక్కడి ఆర్ఐ నవీన్‌కుమార్‌ను గుంతకల్లుకు, బుక్కరాయసముద్రం ఆర్ఐ బషీరున్నీసాను ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడి సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి అనంతపురం స్పెషల్ ఆర్ఐగా బదిలీ కాగా.. ఆత్మకూరు నుండి నాగభూషణను ఇక్కడికి బదిలీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ ఝాన్సీని మాత్రం ఈ బదిలీల్లో ఎక్కడికి నియమించలేదు. తహసీల్దార్ కార్యాలయంలో ఆమె ఒక్కరు మినహా అందరు బదిలీ అయ్యారు.

మద్యంమత్తులో వాచ్‌మన్ మృతి

అనంతపురంక్రైం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో వాచ్‌మెన్ మృతి చెందాడు. ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. శింగనమల మండలం తరిమెలకు చెందిన మబ్బు రామక్రిష్ణ (49) అనంతపురం నగర శివారులోని పీవీకేకే కళాశాలలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కాగా శనివారం నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన మహబూబ్‌బాషాతో కలిసి ఆయన ఇంటికెళ్లాడు. ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. రామక్రిష్ణ మరోసారి మద్యం తీసుకోవడానికి బయటకెళ్లాడు. ఆ తరువాత రామక్రిష్ణ ఆ ఇంటి బయట పడుకోగా, మహబూబ్‌బాషా లోపల పడుకున్నాడు. ఆదివారం ఉదయం రామక్రిష్ణ ఎంతకీ లేవకపోవడంతో మహబూబ్‌బాషా లేపడానికి ప్రయత్నించాడు. కానీ లేవలేదు. మృతి చెందినట్లు నిర్ధారించుకుని ఆయన కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మద్యం మత్తులో మృతి చెందాడా..? లేక ఆ త్మహత్య చేసుకున్నాడా..? అనే కోణాల్లో వి చారిస్తున్నారు. భార్య శివమ్మ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మట్కా బీటర్ అరెస్టు

అనంతపురం క్రైం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాయల్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని నాలుగో పట్టణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పాపంపేటకు చెందిన ఆ వ్యక్తి రాయల్ నగర్‌లో మట్కా నిర్వహిస్తుండగా పోలీసులు కనుక్కొని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడి వద్ద నుంచి రూ.15330ల నగదు స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి అదృశ్యం

అనంతపురం క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగర శివారులో నివాసముంటున్న ఓ వ్యక్తి ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. రుద్రంపేటలో నివాసముంటున్న శివరామిరెడ్డి రెండో కొడుకు ఇంద్రసేనారెడ్డి భార్యతో విడిపోయినప్పటి నుంచి మద్యానికి అలవాటు పడ్డాడు. ఇదివరకు ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయి నాలుగైదురోజులకు తిరిగి వచ్చేవాడు. అయితే గత నెల 16వతేదీన బయట టిఫిన్ చేసి వస్తానని చెప్పి వెళ్లాడు. ఇంతవరకు తిరిగి రాలే దు. ఇన్ని రోజులైనా రాకపోవడంతో తండ్రి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు.

పెన్నాలో ఇసుక తవ్వకాలు నిలిపేయాలి


నిదనవాడ వద్ద పెన్నానదిని పరిశీలిస్తున్న అఖిల పక్ష నాయకులు

శింగనమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పెన్నానదిలో ఇసుక తవ్వకాలు వెంటనే నిలిపివేయాలని, లేనిపక్షంలో ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమని అఖిల పక్షం నాయకుడు జీ.ఓబులు హెచ్చరించారు. మండలంలోని నిదనవాడ సమీపంలో గల పెన్నానదిలో ఇసుక తవ్వకం ప్రాంతాన్ని ఆదివారం ఆయన నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని రాచేపల్లి, నిదనవాడ, చిత్రచేడు, గోపురాజుపల్లి గ్రామాల్లోని పెన్నానదిలో 20 అడుగులు లోతు తవ్వి ఇసుకను తరలిస్తున్నారన్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని బోర్లలో నీరు అడుగంటుతున్నాయని అన్నారు. ఈ విషయమై ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు, పోలీసులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోయిందని వాపోయారు. ఇప్పటికైనా ఇసుక తవ్వకుండా, తరలిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో అఖిలపక్షంలో పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

చంద్రబాబు కొట్టాలలో నిలిచిన విద్యుత్ సరఫరా

●గంటల తరబడి రాకపోవడంతో ఇబ్బంది పడ్డ స్థానికులు

అనంతపురంరూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు కొట్టాలలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం 2గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచింది. రాత్రి 8:30గంటలైనా రాలేదు. దీంతో స్థానికులు విద్యుత్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అయితే సిబ్బంది సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. దీంతో రాత్రైనా కరెంటు రాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. కాగా రాత్రి 8గంటల సమయంలో సంబంధిత సెక్షన్ ఏఈఈకి విద్యుత్ సరఫరా నిలిచిన విషయం తెలియడంతో ఆయన ఆరా తీశారు. ఈ క్రమంలోనే సిబ్బందిని అప్రమత్తం చేసి కరెంటు పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

కోతకు గురైన రోడ్డు..!

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు
● విషయం తెలిసినా పట్టించుకోని అధికారులు

అనంతపురంరూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లి నుంచి హైదరాబాద్- బెంగుళూరు హైవేకు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు కోతకు గురై దాదాపు నెల రోజులు కావస్తోంది. అయినా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. హైవే నుంచి జంగాలపల్లి, కందుకూరు గ్రామాలకు వెళ్లే వారికి ఈ రోడ్డు అనువైనది. అయితే గత నెలలో కురిసిన వర్షాలకు రోడ్డు పలు చోట్ల కోతకు గురైంది. దీనిపై రాకపోకలు సాగించేందుకు సమస్యగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో అయితే ప్రమాదాలకు గురి కావాల్సిందేనని ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని రోడ్డు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.



పలు చోట్ల కోతకు గురైన జంగాలపల్లి రోడ్డు

న్యూస్ బాక్స్

నేడు కంటి వైద్యశిబిరం

విడపనకల్లు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పాల్తూరు గ్రామంలోని గ్రామ సచివాయంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ శివరామి రెడ్డి వర్గీయులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ ఈ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగుల, వృద్ధులకు నేడు శిబిరం

బొమ్మనహాళ్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల, వృద్ధులకు అవసరమైన పరికరాలను గుర్తించడానికి రాయదుర్గం పట్టణంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా ఈ పరికరాలను అందిస్తుందని, మండలంలోని దివ్యాంగులు, వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● ఉరవకొండ : దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన పరికరాల ఎంపికకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం శిబిరాన్ని నిర్వహించినట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధికారి వినోద్ తెలిపారు. వారికి పరీక్షలు నిర్వహించామని, అవసరమైన పరికరాలను మూడు నెలల తర్వాత అందజేస్తామన్నారు.కార్యక్రమంలో ఎంపీడీఓ రవిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

21 నుంచి పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్

గుంతకల్లుటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఈనెల 21 నుంచి 28 వరకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీఎస్‌వీ రమణా రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్ఎస్‌సీ మెమో, స్టడీ, కుల, ఆదాయ, నివాస సర్టిఫికెట్లు ఒరిజినల్, రెండు సెట్లు జిరాక్స్‌తో హాజరుకావాలన్నారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, వెబ్ ఆప్షన్ నమోదుకు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యాశాఖాధికారులను సస్పెండ్ చేయాలి

రాయదుర్గంరూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకోని ఇక్కడి విద్యాశాఖ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు బంగి శివ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు ఇచ్చే మామూలు మత్తులో విద్యాశాఖ అధికారులు మునిగిపోయారని ఆయన ఆరోపించారు.

చెట్టు తొలగింపు

విడపనకల్లు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలికి-చాబాల రోడ్డు పక్కనే ఓ చెట్టు రోడ్డుపైకి కూలేందుకు సిద్ధంగా.. ప్రమాదకరంగా ఉంది. దీనిపై పొంచి ఉన్న ప్రమాదం అని ఈ నెల 5న ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన పంచాయతీ అధికారులు ఆ చెట్టును తొలగించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

రాయదుర్గం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 46 మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ కింద రూ. 24 లక్షలు మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను వారికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తన స్వగృహంలో ఆదివారం అందజేశారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

రాయదుర్గంరూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్రద్రవన్నూరు గ్రామ సర్పంచ్ అశోక్ తండ్రి, టీడీపీ నాయకుడు ఓంకారప్ప(65) అనారోగ్యంతో ఆదివారం మరణించాడు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు.

ప్లాస్టిక్ నిషేధం ఇదేనా..?



సంత వద్ద ప్లాస్టిక్ కవర్లు తింటున్న ఆవు

యాడికి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఏటా జూన్ మాసం రాగానే అధికారులకు పర్యావరణ పరిరక్షణ గుర్తుకు వస్తుంది. రీసైక్లింగ్ కానీ ప్లాస్టిక్‌ను అరికడతామంటూ ఆర్భాటంగా ప్రకటనలు ఇస్తారు. తర్వాత దాని గురించి ఏ మాత్రం పట్టించుకోరు. దీంతో వ్యాపారులు, ప్రజలు యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వాడి పారేస్తున్నారు. ఆ దివారం యాడికిలోని సంత వద్ద ప్లాస్టిక్ కవర్ల ఇలా కుప్పగా వేశారు. వాటిని తింటూ మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలంటే ఇంత నిర్లక్ష్యమా!

ఒక్కో బొలెరో వాహనంలో 60 మంది కూలీల తరలింపు



అధిక సంఖ్యలో కూలీలను తరలిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలో కూలీలు నిత్యం ప్రమాదపు అంచులో ప్రయాణిస్తున్నారు. వారు కూలి పనుల కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నారు. ఒక్కో వాహనం 70 మంది ఎక్కించుకొని పనులకు తరలిస్తున్నారు. చిన్న పిల్లలను క్యాబిన్ టాప్‌పై ఎక్కించుకొని మరీ తీసుకెళ్తున్నారు. లాగేజీలు, బస్తాలు తీసుకెళ్లాల్సిన బొలెరో.. ఆటో వాహనాల్లో వీరిని తరలిస్తున్నారు. కూర్చోడానికి కాదు కదా.. కనీసం కాలు పెట్టేందుకు కూడా వీలులేనంత మందిని ఎక్కించుకొంటున్నారు. పత్తి ఏకడానికి మహిళా కూలీకి రోజుకు రూ. 250, కాస్త దూరం వారికి అయితే రూ. 300 ఇస్తున్నారు. ప్రతి కూలీకి చార్జీని ఆ రైతే చెల్లిస్తాడు. దీంతో ఒకే వాహనంలో అధిక సంఖ్యలో కూలీలను ఇలా తరలిస్తున్నారు. ఒక్కో బొలెరో వాహనంలో 20 మందిని మించి ఎక్కించుకోరాదని పోలీసులు ఆ వాహదారులకు అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. అయినా ఫలితం శూన్యం. తమకు గిట్టుబాటు కాదని వాహనదారులు సుమారు 70 మందిని తరలిస్తున్నారు.



టాప్‌పై ప్రయాణిస్తున్న చిన్నారులు

నిట్టూరు చెరువుకు మోక్షం

● రూ.110 కోట్లతో పనులు
● రైతుల హర్షం



చురుగ్గా సాగుతున్న చెరువు నిర్మాణ పనులు

యల్లనూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు నిట్టూరు చెరువుకు మోక్షం లభించింది. 2007లో గండికోట రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నిట్టూరు చెరువుకు నీరు అందించే విధంగా రూ.110 కోట్లతో చెరువు నిర్మాణ పనులకు నాడు శ్రీకారం చుట్టారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను ఏ మాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే మళ్లీ ఆ చెరువు పనులను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా చెరువు కట్ట నిర్మాణం పనులు వేగం పుంజుకున్నాయి.

● 0.3 టీఎంసీల సామర్థ్యం

మండలంలోని నిట్టూరు చెరువులో 0.3 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా నిర్మాణ పనులు చేపట్టారు. ఇక్కడకు నీరు గండికోట రిజర్వాయర్ నుంచి వైఎస్ఆర్ కడప జిల్లా కొండాపురం మండలంలోని ఏటూరు గ్రామం వద్ద ఉన్న పంప్‌హౌస్ నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల పైప్‌లైను ద్వారా నిట్టూరు చెరువులోకి నీరు వచ్చేలా రూపొందించారు. ఏటూరు నుంచి మండలంలోని మేడికుర్తి మీదుగా యల్లనూరు చెరువుకట్ట వద్ద వరకు మెగా కంపెనీ ఐదు సంవత్సరాల క్రితమే పైప్ లైన్ నిర్మాణాన్ని పూర్తిచేసింది. అనంతరం వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఆ పనులు ఆగిపోయాయి.

● తీరనున్న సాగునీటి సమస్య

నిట్టూరు చెరువు నిర్మాణం పూర్తి అయి.. నీరు వస్తే.. సమీపంలోని నిట్టూరు, పెద్దమల్లేపల్లి, పీఎం కొండాపురం, వేములపల్లి, మేడికుర్తి, భాగ్యనగరం తదితర గ్రామాలకు సాగు నీటి సమస్య తీరుతుంది. చెరువు నిండినట్లయితే భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది.

ఆనందంగా ఉంది



చెరువు పనులు ఇక అంతేనేమో అనుకొనే దశలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. తర్వాత ఈ పనులు ప్రారంభించడం ఆనందంగా ఉంది. పండ్లతోటల రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పనులు వేగవంతం చేయడానికి కృషిచేసిన శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణికి రుణపడి ఉన్నాం.

-సదాశివారెడ్డి, రైతు, నిట్టూరు

నేడు కేసీఎల్ ఫైనల్స్



క్రీడాకారులకు జర్సీలు అందజేస్తున్న విప్ కాలవ, భరత్

రాయదుర్గం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కాలవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న కేసీఎల్-2 క్రికెట్ పోటీలో భాగంగా సోమవారం ఫైనల్స్ నిర్వహించనున్నారు. గ్రామీణ యువతలో దాగిన క్రీడాప్రతిభను గుర్తించేందుకు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, తనయుడు కాలవ భరత్ సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 206 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. అందులో బొమ్మనహాళ్ మండలం నుంచి 40 జట్లు, గుమ్మఘట్ట 24, రాయదుర్గంరూరల్ 26, కణేకల్లు 42, డీ.హీరేహాళ్ 32, రాయదుర్గం పట్టణం నుంచి 42 జట్లు ఎంపికయ్యాయి. మే 20 నుంచి జూన్ 6వ తేదీ వరకు ఆయా మండలాల పరిధిలోని జట్ల మధ్య లీగ్‌మ్యాచ్‌లు నిర్వహించారు. మండలస్థాయిలో విన్నర్ జట్లకు రూ. 50 వేలు, రన్నర్ జట్లకు రూ. 30 వేలు బహుమతిగా అందజేశారు. ప్రతి మండలం నుంచి నాలుగు జట్లు చొప్పున మొత్తం 24 జట్లు సెమీఫైనల్‌కు ఎంపికయ్యాయి. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 9 నుంచి 15వ వరకు సెమీఫైనల్స్ నిర్వహించారు. సెమీఫైనల్‌లోని అన్ని జట్లకు జర్సీలు, లోయర్స్ అందజేశారు. ఫైనల్స్‌లో ఫ్రెండ్స్ 11, కణేకల్లు ఆర్‌జీ జట్ల సోమవారం తలపడనున్నాయి. విజేత జట్టుకు రూ. లక్ష, ఎన్‌టీఆర్ ట్రోఫీ అందజేస్తారు. ఈ మ్యాచ్‌కు ముఖ్య అతిథులుగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆర్డీటీ మాంచోఫెర్రర్ వస్తున్నారు.

యోగాంధ్రలో కలెక్టర్



యోగాలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు

తాడిపత్రి, జూన్15(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చింతల వెంకటరమణస్వామి ఆలయం వద్ద ఆదివారం ఉదయం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీ చింతల వెంకటరమణస్వామిని దర్శించుకున్నారు. ఇందులో ఆర్డీఓ కేశవనాయుడు, డీఎంహెచ్ఓ ఈబీదేవి, మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, యోగా గురువు ఆంజనేయులు, రోటరీక్లబ్ సభ్యులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉరవకొండ చిన్నారులు

ఉరవకొండ,జూన్ 15(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలకు ఉరవకొండకు చెందిన 13మంది ఎంపికైయ్యారు. విజయవాడలో సోమవారం నుంచి రెండ్రోజుల పాటు జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

గుత్తి : రాష్ట్ర స్థాయి యోగాంధ్రా పోటీలకు గుత్తికి చెందిన ఇద్దరు ఎంపికైనట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా ఆదివారం తెలిపారు. మున్సిపాల్టీ నుంచి యోగా పెయింటింగ్ విభాగంలో సుశీల, షార్ట్‌ఫిలిం విభాగంలో విజయభాస్కర్ ఎంపికయ్యారన్నారు. ఇరువురు ఈనెల 16 నుంచి మూడు రోజుల పాటు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి యోగాంధ్రా పోటీల్లో పాల్గొంటారన్నారు.

జనసైనికులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలతో జనసైనికులు

కూడేరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో కీలకపాత్ర పోషించిన నాయకులు, కార్యకర్తలను ఆదివారం కూడేరులో ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇందులో కూడేరు, వజ్రకరూర్ మండలాల కన్వీనర్లు నగేష్, కేశవ, నాయకులు ఈడిగ శివ, సాయి, అనిల్ చంద్ర, కుమార్ పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం



క్షుద్రపూజలు చేసినట్లు చూపుతున్న రామచంద్ర

గుంతకల్లుటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక 60అడుగుల రోడ్డులో నివాసముంటున్న మాజీ కౌన్సిలర్ రామచంద్ర ఇంటి వద్ద క్షుద్రపూజలు కలకలం సృష్టించాయి. శనివారం అర్ధరాత్రి రామచంద్ర ఇంటి ఎదురుగా సిమెంట్ రోడ్డుపై గుర్తు తెలియని వారు క్షుద్రపూజలు చేశారు. ఆదివారం ఉదయం వాటిని గమనించిన రామచంద్ర.. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ప్రభుత్వ పాఠశాలలకు బెంచీలు సిద్ధం



ప్రజావేదిక వద్ద ఉంచిన బెంచీలు

కళ్యాణదుర్గం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బెంచీల కొరత ఉంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేక చొరవ చూపారు. సమస్యను కార్పొరేట్ సంస్థ పవర్ మంచ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ చైర్మన్ కిశోర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ సంస్థ వారు 500 బెంచీలను విరాళంగా ఇచ్చారు. ఆదివారం పట్టణంలోని ప్రజావేదికకు వాటిని చేర్చారు. బెంచీల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి వీటిని త్వరలో అందచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

● కనకదాస భవన నిర్మాణానికి నిధులు

పట్టణంలో భక్తకనకదాసు భవనం నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఇటీవల హిందూపురం ఎంపీ పార్థసారథిని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన ఎంపీ నిధుల కింద రూ.25 లక్షలు మంజూరు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై స్థానిక కురుబలు ఎంపీ, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కరాటేలో కలర్ బెల్ట్ పరీక్ష



బెల్ట్, సర్టిఫికెట్ అందజేస్తున్న మాస్టర్లు

గుంతకల్లుటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎస్‌గోజు రియు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కరాటే కలర్ బెల్ట్ ఎగ్జామ్ ఆదివారం నిర్వహించారు. విజేతలకు సర్టిఫికేట్, బెల్ట్‌ను అందజేశారు. కార్యక్రమంలో కేబీ హాస్పిటల్ వైద్యుడు మంజూర్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, మేస్త్రి దొడ్డప్ప, భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు విశ్వనాథ్ చౌదరి, కరాటే అకాడమీ ఆల్ ఇండియా చీఫ్ టెక్నికల్ డైరెక్టర్ ఎం అల్తాఫ్‌పాషా, ఇన్‌స్ట్రక్టర్ ఫైరోజ్, అకాడమీ ఇన్చార్జి దినేష్ పాల్గొన్నారు.

ఉచితంగా ఫ్రీజర్ బాక్స్‌లు



రాయదుర్గం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్‌లోని హిందూరుద్ర భూమి ఆవరణలో ప్రజల సౌకర్యార్థం ఉచితంగా మృతదేహాలను ఉంచడానికి రెండు ఫ్రీజర్‌బాక్స్‌లు ఉంచామని హిందూ రుద్రభూమి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు టంకశాల హనుమంతు, అధ్యక్షుడు చుంచుల నాగప్ప ఆదివారం తెలిపారు. అవసరమైన వారు 8639572960, 9440822875, 95500 67909 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాధితులకు ఇన్ఫినిటీ ట్రస్ట్ చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్టు సభ్యుడు

శెట్టూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్న మండలంలోని ఖైరేవు గ్రామానికి చెందిన హరిజన వన్నూరుస్వామికి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. అలాగే అదే ఆస్పత్రిలో ఉన్న ఖైరేవు గ్రామానికి చెందిన ఓబుళమ్మకు, పాళ్లూరు వెంకటాంపల్లి గ్రామానికి చెందిన వన్నూరప్పకు ఆయన ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ట్రస్టు సభ్యులు సాయినాథ్, మహలింగ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



గడేకల్లు గ్రామంలో గురువులతో నాటి విద్యార్థులు

విడపనకల్లు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన దాదాపు 60 మంది విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశం నిర్వహించారు. నాటి గురువులను సన్మానించారు. తోటి స్నేహితుడు సీ వేణుగోపాల్ ఆరోగ్యం సరిగా లేక పేదరికంలో ఉండటంతో స్నేహితులంతా కలిసి రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు.

క్రైం న్యూస్..

మహిళ ఆత్మహత్య

విడపనకల్లు, జూన్15(ఆంధ్రజ్యోతి):మండలంలోని పొలికి గ్రామంలో కుమ్మరి రామక్రిష్ణప్ప భార్య జయమ్మ (48) కుటుంబ కలహాలతో ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. కొంతకాలంలో కుటుంబ కలహాలతో కలత చెందిన ఆమె.. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని.. ఆత్మహత్య చేసుకుంది. అనంతరం గమనించిన ఆమె భర్త పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

అడ్వకేట్ ఇంట్లో చోరీ

పామిడి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయం పక్కన నివాసం ఉంటున్న అడ్వకేట్ శ్రీనివాసరావు ఇంట్లో చోరీ జరిగింది. బీరువాలోని రూ. 90 వేలు, 12 తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. తన తల్లి అస్థికలను కాశీలోని గంగలో కలిపేందుకు శ్రీనివాసరావు ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దుండగులు ఆ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఇంటికి వచ్చిన ఆయన చోరీ జరిగిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నిందితుల అరెస్ట్

యల్లనూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగారెడ్డిపల్లిలో నారాయణస్వామి కుటుంబ సభ్యులపై దాడి కేసులో వారాధితో పాటు మరో ఏడుగురిని ఆదివారం అరెస్ట్ చేసి, తాడిపత్రి కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. వారం రోజుల క్రితం రస్తా విషయంపై ఈ దాడి జరిగింది.

వికసిత్ భారత్ సంకల్ప సభ



గుంతకల్లులో మాట్లాడుతున్న చిరంజీవి రెడ్డి

గుంతకల్లుటౌన్,జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇల్లూరు లక్ష్మీనారాయణ భవనంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభను నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు చిరంజీవి రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో పేదల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోదీ పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో వికసిత్ భారత్ గుంతకల్లు ఇన్చార్జి రంగరాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, వాసం రవిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కొలిమి రామాంజినేయులు, అశోక్‌కుమార్, వెంకట రాఘవ, దాసరి శ్రీనివాసులు, హరిహరనాథ్, పురంధర్, శ్రీదేవి పాల్గొన్నారు.

● తాడిపత్రి: పట్టణంలోని ఏపీఆర్ ప్యారడైజ్‌లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప సభను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకండ్ల రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో బీజేపీ అధికార ప్రతినిధి, కడప జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు అంకాల్‌రెడ్డి, రంగనాథ్‌రెడ్డి, శింగిరి లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, గంగాధర్ యాదవ్, ఆంజనేయులు, శేషానందరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి సేవలో న్యాయాధికారి



ఆలయం ఆవరణలో జూనియర్ సివిల్ న్యాయాధికారి భాను

కంబదూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ కమల మల్లేశ్వరస్వామి దేవాలయాన్ని కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ న్యాయాధికారి భాను ఆదివారం సందర్శించారు. ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ చైర్మన్ ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం సన్మానించారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరాయుడు, మాజీ సర్పంచు గాజుల శ్రీరాములు, ఆలయ అర్చకులు ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండులో తనిఖీ



బస్టాండును తనిఖీ చేస్తున్న రీజనల్ చైర్మన్ పూల నాగరాజు

గుత్తి,జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్, డిపోనుఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్ ఆదివారం తనిఖీ చేశారు. పామిడి మండలం కట్టకింద పల్లి గ్రామం నుంచి పామిడికి బస్సు సౌకర్యం కల్పించాలని, ఆ గ్రామం నుంచి 90 మందిపైగా విద్యార్థులు పామిడికి పాఠశాల, కళాశాలకు వెళ్తున్నారని వారిని గ్రామస్థులు కోరారు. వారి వెంట టీడీపీ నాయకులు నరేంద్రచౌదరి, సుధాకర్‌నాయుడు, పవన్‌కుమార్ యాదవ్, బీజేపీ పట్టణ కన్వీనర్ బాలకృష్ణ ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



డిపాజిట్ పత్రాన్ని అందిస్తున్న స్నేహితులు

పుట్లూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకటవేముల గ్రామానికి చెందిన కొండయ్య ఇటీవల గుండెపోటుతో మరణించాడు. అతనితో పాటు డిగ్రీ చదివిన స్నేహితులు రూ.1.25 లక్షలు సేకరించి కొండయ్య కుమార్తె పేరిట బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. ఆ పత్రాన్ని వారు ఆదివారం కొండయ్య కుంటుబానికి అందజేశారు. ఇందులో నాగరంగయ్య, ప్రతాప్‌రెడ్డి, ఓబులేసు, వెంకట్, మల్లి, జయచంద్ర, నరేంద్ర, కులశేఖర్ పాల్గొన్నారు.

శ్మశానాన్ని పునర్నిర్మిద్దాం

తాడిపత్రి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్మశానంలో శాస్త్రోక్తకంగా పూజలు నిర్వహించి పునర్ నిర్మించేలా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం ఆయన పట్టణంలోని పెద్దలు, కులపెద్దలు, బ్రాహ్మణులు, వేదపండితులతో కలిసి శ్మశానాన్ని పరిశీలించారు. చేయాల్సిన అభివృద్ధి, చేపట్టాల్సిన చర్యలపై వారి అభిప్రాయాలు తీసుకున్నారు. ఆయన వెంట బ్రాహ్మణులు జానకిరామయ్యశర్మ, సుదర్శన్‌శర్మ, ఎస్వీ రవీంద్రారెడ్డి, సూర్యముని, జగదీశ్వర‌రెడ్డి, సురేంద్రనాథ్, హరినాథ్‌రెడ్డి, ఎంపి రంగారెడ్డి, అరవిందనారాయణరెడ్డి, పాపిరెడ్డి, రాధాకృష్ణ, లక్ష్మీనారాయణ, భూమా సూరి, ప్రసాద్‌రెడ్డి, మల్లికార్జున, రంగనాథరెడ్డి, రోటరీక్లబ్, లయన్స్‌క్లబ్ వివిధ కులపెద్దలు ఉన్నారు.

న్యాయవిజ్ఞాన్ సదస్సు

గుంతకల్లుటౌన్,జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక అనురాగ వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన్ సదస్సును గుంతకల్లు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి జీ మంజుల ఆదివారం నిర్వహించారు. వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్, న్యాయవాదులు నాగశేషు, తిమ్మప్ప పాల్గొన్నారు.